విశాలమైన ఆటస్థలం, సింగారించుకున్న రతీదేవిలా శోభనంనాటి పడక గదిలా వుంది. చుట్టూ బాల్కనీ, మైకులు, ట్యూబ్ లైట్ల వెలుగులో తోరణాల మధ్యనుంచి తొంగిచూసేఆటస్థలంమనోహరంగావుంది. రెండు రోజులపాటు జరిగే ఈ బంతి ఆటల పోటీలు చూడటానికి జనం తండోప తండాలుగా వస్తున్నారు. బాల్కనీ నిండి పోయింది. మిగిలినవాళ్ళు క్రింద కూర్చుంటున్నారు. సూర్యుడు గెలుపొందిన క్రీడా కారుడిలా వుత్సాహంగా ప్రకాశిస్తున్నాడు. మంత్రిగారు వస్తున్నారని తెలిసి హెడ్ కానిస్టేబుల్ కనకరాజుని బందోబస్తుకొరకు డ్యూటీ అక్కడ వేశారు.

కనకరాజు వేసుకున్న కోటు తెలుపు. అతను తొడుక్కున్న బూటు నలుపు. అతను పెట్టుకున్న టోపీ ఎరుపు. అతన్ది బానకడుపు. అతని పళ్ళు పుచ్చువి. అతని కళ్ళు నిద్రలేనివి. ఇది అతని రూపం.

కనకరాజు కరెంటు స్తంభం ప్రక్కనే నిలబడి ప్రేక్షకుల మాటలు వింటున్నాడు. అతనికి ఆటల తీరు అర్థంకాకుండా వుంది. అతని మనస్సు ఆలోచిస్తూవుంది. పండక్కి పట్టుచీర తెమ్మని అతని భార్య సత్తెమ్మ చెప్పి వుంది. సత్తెమ్మ చట్టాల వారి వీధికి మకుటంలేని మహారాణి. సత్తెమ్మ నోటికి పోటీ లేదు. ఆమె తిట్టుకు తిరుగులేదు. ఆమె మాటకు ఎదురు రాదు. ఆమె సతీ సావిత్రి సినిమా చూడలేదు. మనుషుల్లో శూర్పణఖలుంటారని ఆమెకు తెలియదు. ఆమె రామాయణం చదవలేదు. అందుచేత ఆమె అది ఎరుగదు. కనకరాజుకి భయంగా వుంది. అతనికి డబ్బు కావలసి వుంది. దానితో అతను పట్టుచీర కొని పట్టుకెళ్ళాల్సి వుంది. జేబులో చూసే సిగరెట్ కూడా లేకుండా వుంది.

నిలబడి ఆలోచిస్తున్నాడు కనకరాజు. ఎంతకీ తను ఒక అభిప్రాయానికి రాలేక పోతున్నాడు. అతనికి అవకాశం లేకుండా వుంది. అతను కానిస్టేబుల్‌గా సెలక్ట్ అయిన దగ్గర నుంచి యింత క్లిష్టమైన సమస్య రాలేదు. అతని సెలక్షన్ మామూలుగా జరగలేదు. అతని ఎడంకాలు కొంచెం పొట్టి. అతని కుడికన్ను బాగా లొట్ట. అందులోనూ అతన్ది పెద్దపొట్ట. అందుచేత అతను పై అధికారి పి. ఏ. గారి కాళ్ళుపట్టి, ఆయన చేతిలో నాలుగొందలు పెట్టి, ఆయనకోనమస్కారం కొట్టితే జరిగింది.

ట్రైనింగులో అతను ఆఫీసర్లందరూ టెన్నిస్ ఆడుకుంటుంటే వాళ్ళకు బంతు లందించి, కడవలతో వాళ్ళ యిళ్ళల్లో నీళ్ళు అందించి, వాళ్ళ పెళ్ళాలకు కూరగాయ

**ఆటలోనైనా, బతుకుబాటలోనైనా నేర్పరికి, బలవంతుడికి మాత్రమే గెలుపు; చేతకానివాడు ప్రేక్షకుడుగా మాత్రమే వుండక తప్పదు**

లందించటంతో సరిపోయింది. తరువాత అతన్ని కానిస్టేబుల్‌గా ఒక స్టేషన్‌లో వేయటం జరిగి పోయింది.

అప్పటినుంచి అతనికి ఎన్నో మంచి అవకాశాలు. అతనికి డబ్బు సమస్యరాలేదు. దానికితోడు "కష్టపడి పనిచేసే వ్యక్తి కనకరాజు" అని ఎందరో అనేశారు.

"నీదంతా నటన, కపటం, అవకాశం" అంటాడు. అప్పలస్వామి తన సహోద్యోగి. తనూ, తన పెళ్ళాం సినిమాకు వెళ్తుంటే, "ఏ వూరి పిట్టరా కనకరాజూ?" అని అడిగిన రాస్కెల్. "అవకాశాన్ని డబ్బుగా చేసుకుంటున్నావ్ చచ్చేటప్పుడు సరిగా చావవరా!" అన్న యిడియేట్. ఛీ! వాడిసంగతి తన కెందుకు, తనకు డబ్బుకావాలి. ఎలా? అని అనుకున్నాడు కనకరాజు.

'కూ' అనే శబ్దంతో పోలీసులు బెల్లం కొట్టిన రాళ్ళలాగా సెల్యూట్ చేస్తూ నిలబడి పోయారు. ముందు మంత్రిగారి కారు రాలేదు. పైలట్ వచ్చింది. తరువాత మంత్రిగారి మృదువైన కారు మెల్లగా వచ్చింది. వెనుక ఎస్కార్ట్.

అసలు దొంగలకి, దేశనాయకులకి మాత్రమే ఈ బందోబస్తులు, ఎస్కార్టులు అని అనుకున్నాడు కనకరాజు. ఎస్కార్టులు లేకుండా వెళ్ళిన వ్యక్తి అభిమన్యుడొకడున్నాడని, పద్మవ్యూహంలో అతన్ని పడగొట్టారని కనకరాజుకి తెలియదు, కనకరాజుకి చాల విషయాలు తెలియవు. భారతంలో శకుని అనేవాడుండేవా



"ఫొ టో గ్ర ఫీ"
తెలుగు త్రైమాస పత్రిక
జనవరి సంచిక వెలువడింది!
ఈ సంచికలో: విషయాత్మక ఛాయాచిత్ర ప్రదర్శన (డా॥ డి. వి. రావ్); సమాధానాలు (శ్రీ టి.కాశీనాథ్, ఢిల్లీ): సినీఫొటోగ్రఫీ (కుమారి జయ): S V. యూనివర్శిటీ NSS వార్షిక నివేదిక: హ్యూమనిజం (శ్రీ ఎన్.వి. బ్రహ్మం) వార్తలు-విశేషాలు.... చదవండి. ఫొటోగ్రఫీ, సంఘసేవ ఇతివృత్తాలుగా కథలు, కవితలు, వ్యాసాలు పంపగోరుతున్నాం.
ఫొ టో గ్ర ఫీ.
P.B. No.38, చీరాల-523155(ఎ.పి.)

ఉచితము! ఉచితము!
తెల్లమచ్చలు
అన్ని రకాల మచ్చలను, ఎరుపు రంగును మా ప్రఖ్యాత మందు అయిదు రోజులలో మాన్పును. త్వరలోనే చర్మము మామూలు రంగు పొందును. ప్రచార నిమిత్తము ఒక సీసా మందు ఉచితంగా పంపబడును. వెంటనే వ్రాయండి. వివరాలకు.
Bharat Ayurvedashram
P.O. Katri Sarai (Gaya)

వార్తలకు, వ్యాఖ్యలకు
"ఆంధ్ర జ్యోతి"
దిన పత్రికనే చదవండి.

దీర్ఘ వ్యాధులకు ఉత్తమ సిద్ధ వైద్యం!

హస్త ప్రయోగం, అంగము చిన్నదై అవసర కాలమందు అసంతృప్తి, శుక్లనష్టము, నపుంసకత్వము, హెర్నియా, చర్మవ్యాధులు, పోస్టు ద్వారా కూడా వైద్యం చేయబడును.
వరిబీజము(బుడ్డ), మూత్ర వ్యాధులు ఆపరేషన్ లేకుండా రండి.
డా॥ దేవర, ఫోన్ 551,
మార్వాడి గుడి వద్ద, తెనాలి.
బ్రాంచి: 9-డి, శివాజీ స్ట్రీట్, మద్రాసు-17.

దనీ. వాడు చెప్పేది ఒకటి. చేసేది వేరొకటి అని. ఆ శకుని జూదంలో ధర్మరాజుని ఓడించాడనీ కనకరాజుకి తెలియదు.

పలుకుబడి, ప్రాభవం గల పెద్దలంతా మంత్రిగార్ని రిసీవ్ చేసుకున్నారు. టైం రెండున్నరక్కేసి పరుగెడుతున్న సమయంలో జాతి ఔన్నత్యాన్ని గురించి ముందు చెప్పి, తరువాత ఆట మొదలుపెట్టబోతున్నారని చెప్పారు. మొదటి సారిగా గుంటూరు జట్టుకి, గుంతకల్ జట్టుకి జరుగుతోంది. ఆట జోరుగా సాగుతోంది. కనకరాజు బుర్ర ఆలోచనలతో వూగుతోంది.

డబ్బు కావాలి! ఎలా? తను వుద్యోగంలో చేరింది మొదలు ఎంతమంది ఆఫీసర్లకి ఎంతెంత డబ్బు సర్దలేదు. కనకరాజు కానిస్టేబుల్ అయినా వాళ్ళ ఆఫీసు కోశాధికారి రహస్యంగా. ఆ ఆఫీసు క్రిందవున్న రోడ్డు ప్రక్క దుకాణాలు, సానికొంపలు, సారాయి దుకాణాలు, బ్రోకర్ల బ్రతకాలంటే నెలకు రెండు కేసులు కోర్టుకి కట్టాలి, కొంత మొత్తం కానిస్టేబుల్స్‌కి యివ్వాలి. కానిస్టేబుల్స్ అందరూ ఆ డబ్బు తెచ్చి కనకరాజు చేతిలో పెట్టాలి. కనకరాజు వాటిని కోడి పెట్టలుగా, కుర్చీ బల్లలుగా, కూరగాయలుగా మార్చి ఆఫీసర్లందరికి సదుపాయం చేయాలి.

ఇవిగాక పెద్ద దొరలు ఫోన్ చేస్తే వెంటనే కవర్లో పెట్టి డబ్బు అందించాలి. ఇవన్నీ పోను మిగిలితే కానిస్టేబుల్స్ అందరూ పంచుకోవాలి. మిగలకపోతే వాళ్ళను తిట్టుకు చావాలి.

'ఓరి భగవంతుడా? ఏం వుద్యోగంరా!' అని తిట్టుకోలేదతను. అబద్ధానికి నీతి పూతలు పూయగలడతను.

మైకులో విశాఖపట్నం వర్సెస్ విజయనగరం మహిళల ఆట మొదలుపెట్టబోతున్నారని చెప్పుతున్నారు. కనకరాజు ఆలోచనలు కట్టిపెట్టి, కాసేపు ఆట చూసి, టీదుకాణం వైపు నడిచాడు. అప్పలస్వామి టీ తీసికోబోతూ, వన్-బై-టు చేయించి కనకరాజుకి యిచ్చాడు. కనకరాజు టీ త్రాగి, అప్పలస్వామి దగ్గర సిగరెట్ తీసుకొని వెలిగిస్తుంటే అప్పలస్వామే అన్నాడు 'రేపు నాకు ఆఫ్' అని.

'అహ' అంటూ కనకరాజు ఆలోచించడం ప్రారంభించాడు.

అవి తన పెళ్ళయిన తొలి రోజులు. తన భార్య నగలు కావాలంది. వడ్డీ వ్యాపారి శ్రీరంగం దొంగ బంగారం కేసు తన చేతిలో వుంది. సిగరెట్ నోట్లో వుంది. పొగ పీల్చినట్లు పీల్చాడు. పెళ్ళాం దగ్గర వదిలాడు.

ఇది కనకరాజు సంపాదన చరిత్రలో

# తక్షకాయస్వాహ

మీకు తెలుసుగా ఆ కథ
తక్షకుడికోసం చేసిన
సర్పయాగంలో
చివరికి చచ్చినవి
చిన్న పాములు.
ఇంద్ర పదవిని ఆసరా చూసుకున్న
దుర్మార్గుడు
ఇబ్బందేం లేకుండా బతికిపోతాడు
మళ్ళా ఆ కథే జరుగుతుంది
చూసుకోండి
మరో ఆస్తికుడు అడ్డురాకుండా
కాసుకోండి
మామూలు ప్రజలంతా ఒక్క
గొంతుకతో
సహేంద్ర తక్షకాయ స్వాహా
అనాలంది.

—నా. రా.

తొలి మజిలీ. మరునటి రోజు శ్రీరంగం కేసు మోహన్ అనే పాతకేడీ మీద రుద్దటం, కోర్టు అతనికి శిక్ష విధించటం, శిక్ష పూర్తికావటం, మోహన్ తిరిగి రావటం, శ్రీరంగం దగ్గర వాటా పుచ్చుకోవటం, యిట్టే జరిగిపోయాయి.

మళ్ళీ మోహన్ కనకరాజుకి వాటా యివ్వవల్సిందే. నీతి, న్యాయం అనేపదాలు కనకరాజు వృత్తి ధర్మపు రథ చక్రాల క్రింద పడి నలిగిపోవల్సిందే.

అదే సంవత్సరం పెద్దింట్లో నల్లడబ్బు పట్టుకున్నారు. కనకరాజు డ్యూటీ అక్కడ పడింది. కనకరాజు పంట పండింది. కనకరాజు శాసనాల రోడ్డులో చట్టాలవారి వీధిలో పెళ్ళాం పేరుతో యిల్లు కట్టిందీ ఆ సంవత్సరమే. ఆ సంవత్సరమే కానిస్టేబుల్ కనకరాజు హెడ్ కానిస్టేబుల్ అయ్యాడు. అతను పరపతి పెరిగిన తదుపరి తిరుపతి వెళ్ళి వచ్చాడు. ఆ సంవత్సరమే శ్రీరంగం తండ్రి రాజాసాహెబ్‌ను దొంగలు తీసుకెళ్ళారని కేసు వచ్చింది. రాజాసాహెబ్ కుష్ఠురోగి. ఆ కేసు యింతవరకు తేలలేదు.

అవి ఎంత బంగారు రోజులు అని అను

కున్నాడు కనకరాజు. అలాంటిది కేవలం పట్టు చీరకు డబ్బులేకపోవటమా, రాక పోవటమా, అవకాశాలు లేకపోవటమా?" అని అనుకున్నాడు కనకరాజు.

డబ్బుకోసం యింత యిబ్బంది తనె వ్పుడూ పడలేదా? ఆఁ ఓసారి పై అధికారి క్యాంపుకు వచ్చినప్పుడు. తన దగ్గర డబ్బులు తక్కువగా వున్నప్పుడు, వంట వాడు 'నాలుగు అర కోడిపెట్టలు, నాలుగు డజన్ల కోడిగుడ్లు, నాలుగు బ్రాందీ బుడ్లు, నాలుగు కేజీల నెయ్యి' అని ఫోజుపెట్టి చెప్పకముందే!.... 'ఒరే బాబు! అల్లరి పెట్టకు. ఏదో నీ ఖర్చుకు యిందు ఈ పది వుంచు. కాస్త కనికరించు' అంటూ వాణ్ణి బ్రతిమాలుకునేటప్పుడు వచ్చిన బాధ. యిప్పుడు తను చెందుతున్న వ్యథ రెండూ ఒకటే.' అని అనుకున్నాడు కనకరాజు.

ఆలోచిస్తున్నాడు. గతంలో తనకు డబ్బు ఎలా వచ్చేదో, ఎలా సంపాదించేవాడో, అలాంటి పేవైనా యిప్పుడు పట్టుచీర సంపా దించటానికి సహాయపడతాయేమోనని.

దసరా పండుగ వచ్చిందంటే కానిస్టే బుల్సు అంతా కలిసి చందాలు వసూలు చేసుకునే నిమిత్తం పాట పెట్టుకుంటారు పండుగకి ముందరే రహస్యంగా. గత సంవ త్సరం ఆరు వేలకు కనకరాజే పాడాడు. అందులో ఆఫీసర్ల పెళ్ళాలకు పట్టుచీరలు, కోడిపెట్టలు దసరా కానుకగా యిచ్చి, మిగిలింది అందరు కానిస్టేబుల్సు పంచు కున్నారు. తరువాత కనకరాజు కొంతమంది కానిస్టేబుల్స్‌ని వెంబడి వేసుకొని వసూలు చేసుకుంటే ఎనిమిది వేలు వచ్చింది. రెండు వేలు లాభం వచ్చింది. ప్రతి వ్యాపారస్తుడు పది, యిరవై, యాభై, వంద, రెండు వందలు ఏడుస్తూ యిచ్చేవాళ్ళు. తప్పు తుందా మరీ! వచ్చినోళ్ళు పోలీసోళ్ళు. ఇచ్చేది దసరా మామూళ్ళు. ఇవ్వకపోతే ఎప్పుడో ఒకప్పుడు స్టేషన్ ముందో, వెనకో వదులుతాయి కీళ్ళు.

'ఎవడు నీతిగా బ్రతుకుతున్నాడు?'

ఎవడిని నీతిగా బ్రతకనిస్తున్నారు?" అంటూ వాపోయాడొక అనాకారి వ్యాపారి. పాత అనుభవాలు, గత జ్ఞాపకాలు కళ్ళ ముందు గిర్రున తిరిగేసరికి కనకరాజు తలెత్తి చూశాడు. అందరూ తిరిగి వెళ్ళి పోతున్నారు.

ఆరోజుకి ఆట అయింది.

రాత్రి తొమ్మిది గంటలు కావస్తోంది. మేఘాలుకప్పిన చంద్రుడుదెబ్బతిన్న క్రీడా కారుడిలా వున్నాడు. అవినీతికప్పిన నీతిలా మసగ్గా వుంది వెన్నెల. కనకరాజు సైకి లెక్కి వెళుతున్నాడు. సైకిల్‌కి లైటు లేక

చదివించేది! మగదిక్కు చదవాలనిపించేది!!
పైడిపాటి సుబ్బరామశాస్త్రిగారి
సంచలనాత్మక సంసారనవల
ఆంధ్ర సచిత్రవారపత్రిక పాఠకులను
విశేషంగా అలరించిన రసవత్తరగాథ
వెల: పదిరూపాయలు
మీకాపీకై: భారతీనికేతన్—విజయవాడ 520004కు
వ్రాయండి




కేశవర్ధినిని
మీరు తలకు రాసుకొనే నూనెలో కలిపి ఉపయోగిస్తే అధికంగా మంచి గుణాన్ని పొందుతారు. మీ తల వెండ్రుకలు ఒత్తుగా రోజు రోజుకీ పొడుగ్గా పెరుగుతాయి.

దక్షిణ భారతదేశపు సాంప్రదాయిక కేశ సౌందర్య రహస్యమే కేశవర్ధిని. మీరు వాడుకొనే తలనూనెలో కేశవర్ధినిని కలిపి ప్రతి రోజూ తలకురాసి తల చర్మానికి అంటేటట్లు చేయండి. మీ తల వెండ్రుకలు ఊడి పోకుండా జేసి ఆరోగ్యవంతంగా అందంగా పెరిగించడానికి ఇదేమంచి మార్గము ఇప్పుడే కేశవర్ధినిని ఉపయోగించడం మొదలు పెట్టండి. కేశవర్ధిని సాధారణ తల నూనెకాదు. దీన్ని కొబ్బరినూనెలోనో లేక మీరు వాడే ఇతర తల నూనెలోనో కలిపి వాడాలి.

కేశవర్ధిని ప్రోడక్ట్స్, ఆర్కాటు రోడ్డు, మద్రాసు-600 087

OBM 3837/2 Tel

గాథావళి:

# చార్లెస్ గ్రాండ్ మేంజ్

చరిత్రలో అపార మేధావిగా పేరుగాంచిన "చార్లెస్ గ్రాండ్ మేంజ్" ఫ్రాన్సులోని ఎపినాల్‌లో పుట్టి 1835-1895 మధ్యకాలంలో జీవించాడు. బహుశా ప్రపంచంలో ఇంతవరకు ఎవరూ కనీవినీ ఎరుగని మేధావి ఇతనొక్కడే. కాని విధి అతన్ని పుట్టుకతోనే కాళ్ళు, చేతులు లేకుండా క్రూరంగా శిక్షించింది. పుట్టినప్పుడు దాదాపు ఒక పౌను బరువుండేవాడు. అంగ విహీనుడైన తన బిడ్డను చూసి దుఃఖంతో, ఉద్వేగంతో అతని తల్లి ఏమైపోతుందోనని పుట్టిన వెంటనే చాలా వారాలు రహస్యంగా దాచారు. కాని కాళ్ళు, చేతులు లేకపోయినప్పటికీ మానవాతీతమైన ప్రజ్ఞా విశేషాలుగల మెదడు అతని లోటుపాట్లను కప్పివేసింది. అత్యంత మేధా సంపత్తిగల అతని మస్తిష్కము విద్యుల్లతకన్న శీఘ్రంగా పనిచేసేది. అనతి కాలంలోనే ఆయన గణితశాస్త్రంలో తన ప్రతిభాసంపత్తి కనపర్చేవాడు. 14 సం॥ల వయస్సు నుంచి యూరప్‌లో దేశాలను ఈ చివరినుంచి ఆ చివరివరకు చుట్టివచ్చాడు. విద్యుత్ యంత్రాలకన్న వేగంగా లెక్కలు చేసేవాడు. అతని శరీరమంతా పదహారు అడుగుల వెడల్పుగల చెక్క పెట్టెలో వుండేది. కాని 100 అంకెలుగల రెండు సంఖ్యలను గుణించి ముప్పై సెకండ్లలో చెప్పేవాడు. ఇరవై మూడు అంకెలుగల సంఖ్యల రెండింటిని ఒకదానితో ఒకటి భాగించి ఒక చూపులోనే దాని జవాబు చెప్పేవాడు. 19వ శతాబ్దంలో అతడు ఒక మానవ రూపంలో నున్న, మహాద్భుతమైన లెక్కల యంత్రంగా పేరుగాంచాడు.



సుప్రసిద్ధ గణిత శాస్త్రవేత్తలకు కొన్ని గంటలుపట్టే ఎంతటి చిక్కు సమస్యనైనా నిమిషాలలో చెప్పగలిగే ప్రజ్ఞాశాలి. ఇంతటి మేధావికి తన సొంత అవసరాలకు, వ్రాసుకోవడానికి చేతులు, కాళ్ళు లేకపోవడంవల్ల ఇతరులపై ఆధారపడవలసి వచ్చేది.

—రుద్రరాజు అప్పలరాజు

పోతేరూపాయి తీసుకునే కనకరాజు. అది యివ్వకపోతే సైకిల్‌ను స్టేషన్‌కు తీసుకుపోయే కనకరాజు సైకిల్‌కి లైటులేదు. అది అడిగే ధైర్యం ఎవరికీలేదు. అతని వుద్యోగంలో న్యాయం లేనేలేదు.

రోడ్డు ప్రక్క చిన్న టీ దుకాణం దగ్గర ఆగాడు. టీ దుకాణం రాజుది. అతని వ్యాపారం రాత్రిది. పగలు అది ఎక్కడికో పోతుంది. ఆ దుకాణం కనకరాజుకి రూపాయి మామూలు యిస్తుంది.

అలాంటి దుకాణాలు చాల వున్నాయ్. రాజు కొడుకు రంగడిని పిలిచి పంపించాడు కనకరాజు. రంగడు అన్ని దుకాణాల దగ్గర మామూళ్ళు దండుకొని, కనకరాజుకిచ్చాడు. అవి తీసుకొని ప్రభుత్వ సారాయి దుకాణం దగ్గర ఆగాడు, మూడు డ్రాములు తాగాడు. ఏంఉంటో వాగాడు,

అసలు కనకరాజునిద్రలేవగానే దైవాన్ని కోరుకునేది యివాళ సారాకైనా డబ్బు సంపాదించాలని. ఓ దౌర్భాగ్యుడు అతని వ్యూహంలో చిక్కుకుని గుండెలు పగిలేలా ఏడ్వాలి. ఓ నిర్భాగ్యురాలు విందలపాలై వేదనతో, రోదనతో కంపించి కన్నీళ్ళు కార్చాలి. ఆ కన్నీళ్ళు కనకరాజు గొంతులో సారానీళ్ళుగా దిగాలి.

అసలు సమాజంలో అరాచకం ప్రబలాలి అని కోరుకునేది యిద్దరే యిద్దరు. పోలీసులు, ప్లీడర్లు. కేసులకోసం గుంటకాడ నక్కల్లాగా కాచుక కూర్చుంటారు. న్యాయంతో వాళ్ళకు అవసరంలేదు. వాళ్ళ అవసరాలతో అవకాశాలతోనే వాళ్ళకు అవసరం.

కనకరాజు యింటికి వెళ్తే సత్తెమ్మ పట్టు చీర తేలేదని తిట్టుతుందేమోనని, నెత్తిన మొట్టుతుందేమోనని బితుకు బితుకుమంటూ యింటికి వెళ్ళాడు.

"సత్తెమ్మ సినిమాకెళ్ళింది" అని ప్రక్కింటి పడుచు పిల్ల చెప్పింది. "హమ్మయ్య" అని అనుకొని, భోజనం చేసి, ఆటలు ఆడి అలసిపోయిన, క్రీడాకారుడిలా హాయిగా పడుకున్నాడు.

ఆలోచనల అన్యాయాల ఆటలనుంచి నిజ నిద్ర పట్టేసింది.

• •

రెండవ రోజు ఆట రెండు గంటలకే మొదలుపెట్టారు. మంత్రిగారు రాలేదు. మంత్రిగారి సతీమణి, పిల్లలు వచ్చారు.

ముందుగా కాకినాడ, కర్నూల్ జట్లు ఆడుతున్నారు. కనకరాజు నిలబడి ఆలోచిస్తున్నాడు. ఉదయం వచ్చేటప్పుడు సత్తెమ్మ నానా తిట్లు తిట్టి చెప్పి పంపింది. ఈ రోజన్నా పట్టుచీర పట్టుకెళ్ళకపోతే అన్నం కూడా పెట్టదు. అందుచే ఎలాగైనా డబ్బు సంపాదించి పట్టుచీర పట్టుకెళ్ళాలి. తన మనుగడ ఆమె కోసం. పట్టుచీర ఆమె కోసం. ఆమె యిచ్చే సుఖం కోసం అని అనుకున్నాడు కనకరాజు.

ఇంతలో పాత కేడీ మోహన్ కన్పించాడు.

"బావున్నావా?" ఎంతో ఆప్యాయంగా పలకరించాడు కనకరాజు. తల్లులకి పిల్లల మీద, పోలీసోళ్ళకి పాత కేడీల మీద, దొంగలమీద అభిమానాలు, ప్రేమలు వుంటాయ్.

టీ తాగుదాం రమ్మని తీసుకెళ్ళాడు. "ఈ మధ్య.... ఏమన్నా...." అంటూ మొదలుపెట్టాడు కనకరాజు.

"అబ్బే ఏంలేదు గురూ....చాల డల్‌గా వుంది" అని చెప్పాడు మోహన్.

"పోనీ ఏదైనా వుంటే చూడు. నాకు నాలుగు వందలు కావాలి" చాల చిన్నగా బుజ్జగించినట్లు అడిగాడు కనకరాజు.

"అయితే యిక్కడే వుండు గురూ, అరగంటలో వస్తా" అంటూ వెళ్ళిపోతోతున్న మోహన్‌ను ఆపి 'త్వరగా రావాలి' అని తొందరచేసి పంపించాడు కనకరాజు. అవకాశం కల్పించినందుకు ఆ భగవంతుడికి మనస్సులో నమస్కరించుకున్నాడు.

చప్పట్లు - ఈలలు - కేకలు. ఉమెన్స్ ఫైనల్స్‌లో విన్నర్స్ విజయవాడ అమ్మాయిలకి, రన్నర్స్ రాజమండ్రి అమ్మాయిలకి వచ్చింది. మెన్స్ ఫైనల్స్ జోరుగా సాగుతుంది.

ఆలసటతో ఆనందంతో పరుగెత్తుకుంటూ వచ్చాడు మోహన్. నాలుగు వందల రూపాయలు కనకరాజు చేతిలో పెట్టాడు. ఆనందంతో పొంగిపోయాడు కనకరాజు.

"ఊఁ ఎలా జరిగిందిరా?" అని అడిగాడు కనకరాజు సిగరెట్ కాలుస్తూ.

"రాత్రి ఎవరో గురూ చాల బాగుంది. ఒంటి నిండా బంగారం వుంది, వయసులో వున్న చిన్నది. మెయిన్ రోడ్డులో కలి

సింది. రాత్రి యిల్లు చూసి వచ్చాను. ఇవ్వాళ వెళ్ళి రోడ్డు మీద నుంచి చూశాను. ఇంట్లో ఒక్కతే నిద్రపోతుంది. వెళ్ళి నోరునొక్కి.... మొత్తం మీద రెండు పనులూ పూర్తి చేసుకొచ్చాను గురూ. ఆ( వస్తుంటే అది కేక లేసింది. చాల మంది వెంట తరిమారు. తప్పించుకొని శ్రీరంగం దుకాణంలో నగలుపెట్టి ఆరు వందలు తెచ్చానంతే." విజయ గర్వంతో చెప్పాడు మోహన్.

"రసికుడివిరా" అని మెచ్చుకున్నాడు కనకరాజు.

"సరే గురూ, నాకు చాలా పన్లున్నాయి వస్తా" అంటూ వెళ్ళిపోయాడు మోహన్.

ఆఖరి ఆటలో విశాఖవారు విజయం సాధించారు. ఉత్సాహంగా ఆడినందుకు తగిన ప్రోత్సాహం లభించినందుకు అందరూ సంతోషంగా వెళ్తున్నారు. కనకరాజు సంతోషంగా బజారుకి వెళ్ళాడు. పట్టు చీర కొని సంతోషంగా ఇంటికి వచ్చాడు. ఎదురుగా అప్పలస్వామి వచ్చి "పాత కేడీ మోహన్‌గాడు మీ ఆవిడ్ని బెదిరించి, నగలు పట్టుకుపోయాడు" అని చెప్పాడు.

ఆటలో దెబ్బతిన్నట్లు అయిపోయాడు కనకరాజు. అతని నోట మాట రాలేదు. కేవలం నగలే పట్టు కెళ్ళాడా? అంతకంటే విలువైంది, పవిత్రమైందీ ఏదో ఏదో దోచుకెళ్ళాడు. ఆలోచనలతో అతని మనస్సు పుట్ట అయింది. జుగుప్స, నిరాశ మొలకెత్తాయి. చింత చెట్టుక్రింద బండ రాయి చీకటిగా వుంది. చింతతో అతని జీవితం కటిక చీకటై పోయింది. అతని భార్య కులట, అపవిత్రురాలు అయిపోయింది. ఆడది, అవకాశం ఒకటైపోయింది.

మనిషి కర్తవ్యం మరచి అవకాశం వుందని అవినీతికి పాల్పడి దుర్భర జీవితాలతో చెలగాటం ఆడితే చివరకు "తన" అనుకునేవాళ్ళుకూడా ఆ ఆటలో పావులుగా మారిపోతారు. ఎంతోమంది కులటలను ప్రోత్సహించిన కనకరాజు అతని భార్య కులట అయినందుకు భరించలేకపోయాడు. ఎన్నో రహస్యాలను గుండెల్లో దాచుకున్న కనకరాజు యీ రహస్యాన్ని దాచలేకపోయాడు. ఎవరితోను చెప్పుకోలేకపోయాడు. అతను భార్యను నమ్మలేకపోయాడు. అనుమానంతో అతను పిచ్చివాడై పోయాడు.

"అవకాశాన్ని నమ్మవద్దు. ఆడదాన్ని నమ్మవద్దు. అవకాశంలో అన్యాయం వుంది. అధికారం వుంది. ఆడది వుంది. జీవితం పాడైపోయింది" అని కేకలేస్తూ వుద్యోగం వదలి వూళ్ళమీద తిరగటం ప్రారంభించాడు. తరువాత అతనికి భయంకరమైన కుష్ఠువ్యాధి వచ్చి ముష్టి ఎత్తుతూ తిరిగాడు. బాధతో, చలితో, ఆకలితో అతను మురికి కాలువ ప్రక్క మూలుగుతూ దిక్కులేని చావు చచ్చాడు.

కాకులు, కుక్కలు కూడపలుక్కొని కనకరాజు శవాన్ని పీక్కుతింటున్నాయి. మున్సిపాలిటీవారు చూసి పోలీసులకు తెలిపారు. వారు శవాన్ని తీసుకెళ్ళి, పెండింగ్ వున్న కేసు తీసి 'ఆ శవం కుష్ఠుది, అది వడ్డీ వ్యాపారి శ్రీరంగం తండ్రిది' అని తేల్చారు. పోలీసులు, డాక్టర్లు కూడబలుక్కొని అది హత్య అని నిర్ధారణ చేశారు. అందుమీద నేర పరిశోధక విభాగంవారు దర్యాప్తు జరుపుతున్నారు.

సంవత్సరం గడిచింది. ఆటలపోటీలు మళ్ళీ జరుపుతున్నారు. మంత్రిగారు వస్తున్నారు. మంచి బందోబస్తే వుంది. కనకరాజు ప్లేస్‌లో ప్రమోషన్ వచ్చిన అప్పలస్వామి డ్యూటీ అక్కడ పడింది. అతనికి ఆటల తీరు అర్థం కాకుండావుంది. అతని మనస్సు పరిపరి విధాల ఆలోచిస్తూ వుంది. పట్టుచీర తెమ్మని అతని భార్య పార్వతమ్మ మరీ మరీ చెప్పి వుంది.

ఆట జోరుగా సాగుతూ వుంది. ★


THE INSTITUTE OF ENGLISH STUDIES
ఆంగ్ల భాషాబోధక సంస్థ,
17, మొదటి మెయిన్‌రోడ్డు, లేక్ ఏరియా,
నుంగంబాకం, మదరాసు-600 034
(వళ్లువరుకోటము ప్రక్కన)

WHAT CANNOT BE ACHIEVED BY SYSTEMATIC EFFORT ?

ప్రయత్నమువలన ఫలించని పనులున్నవా?

16 ఏండ్ల వయస్సునకు పైబడినవారు

ఒకే సంవత్సరములో



కోయదాన్ని, కొండజాతి కోయదాన్ని, కొంచెమే చదివిన నన్ను అతడు పెండ్లాడుటకు ఒప్పుకొనునా? నా చేతి విద్యారేఖ ప్రకాశించుచున్నదా? బాగుగా ప్రకాశించుచున్నదా? యువతీ! ఆంధ్ర యువతీ! నిజముగా మంచి కాలము, మంచివేళ పంచాంగములో లేదు. విద్యారేఖ, ధనరేఖ, హస్తమునందులేవు. అవి ప్రయత్నముయొక్క ఫలములు. తక్కువవిద్యను ఎక్కువచేయుటకు ప్రయత్నించుము. ఇపుడే ప్రయత్నించుము. అతనికే పాఠములు నేర్పునంతటి నేర్పు నొందుము. నీ పలుకులనతడు ఆలకించును. వశీకరణమంత్రముచేనతనిని నీవు లొంగదీసుకొనెదవు. నీవు ఊదు నాగస్వరమునకు అతడు బుట్టలోని పామువలె వగును. ఇది పెద్దల సందేశము. తప్పక ఫలించును.

G. SHANMUGASUNDARAM

విశ్రాంతి సమయములో
ఆంగ్లములో
సంభాషించుటకును, పరిచయముచేసికొనుటకును, తపాలా ద్వారా
ప్రారంభమునుండి కాని - లక్ష్యలక్షణ పరిశోధన పద్ధతిలోకాని
ఇంగ్లీషు
నేర్చుకోవచ్చును.

ప్రారంభించు క్రొత్త తరగతులగూర్చి నేరుగా వచ్చికాని, 20 పైసల తపాలాబిళ్లతో లేఖను వ్రాసికాని పూర్తి వివరములను తెలిసికొనండి. వెంటనే చేరండి.